## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- సాగరమాల ప్రాజెక్ట్ కింద రాష్ట్రంలో 15 ఓడరేవులను నిర్మిస్తున్నామని కేంద్రమంత్రి జేపీ నడ్డా తెలిపారు.
- చట్ట సభల్లో మహిళా సాధికారిత అనే అంశంపై జాతీయ సదస్సు ఈరోజు తిరుపతి నగరంలో ప్రారంభమయ్యింది.
- జీఎస్టీ సంస్కరణలతో నిత్యావసరాల ధరలు తగ్గనున్నాయని రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ వెల్లడించారు.
- భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య ఆసియా కప్ టీ20 క్రికెట్ మ్యాచ్ రాత్రి 8 గంటలకు ప్రారంభం కానుంది.

==============================

అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ చిరునామాగా మారుతోందని కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా పేర్కొన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వ పాలనలో రాష్టం శరవేగంగా అభివృద్ది చెందుతోందన్నారు. విశాఖ పర్యటనలో ఉన్న ఆయన ఈరోజు భారతీయ జనతా పార్టీ ఏర్పాటు చేసిన సారథ్యం ముగింపు సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్ స్పెషాలిటీ ఆసుపత్రులు, 17 నూతన వైద్య కళాశాలలను రాష్ట్రానికి కేటాయించామన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం 625 కోట్ల రూపాయలతో నిర్మాణం అవుతోందని, విశాఖ రైల్వే జోన్ కూడా సిద్ధమవుతోందని చెప్పారు. సాగరమాల కింద 15 ఓడరేవులను నిర్మిస్తున్నామని కాకినాడ, విశాఖ ఫిషింగ్ హార్బర్ల పునర్నిర్మాణం జరుగుతోందని జేపీ నడ్డా వెల్లడిస్తూ..

(వాయిస్ 34 సెకన్లు)

అదే విధంగా ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి పిలుపు మేరకు ఆత్మనిర్భరత సాధించాలంటే స్వదేశీ ఉద్యమం రావాలన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలతో నిత్యావసరాల ధరలు తగ్గనున్నాయని పీవీఎన్ మాధవ్ తెలియాయజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================

చట్ట సభల్లో మహిళా సాధికారిత అనే అంశంపై జాతీయ సదస్సు ఈరోజు తిరుపతి నగరంలో ప్రారంభమయ్యింది. రెండు రోజుల పాటూ జరిగే ఈ సదస్సుని లోక్ సభ సభాపతి ఓం బిర్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... ఏదైనా సాధించగలమన్న నమ్మకాన్ని మహిళలు కలిగి ఉండాలన్నారు. ప్రతి రంగంలో ముందంజలో ఉన్న మహిళలను వారు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. చట్టసభల్లో మహిళల పాత్ర కీలకంగా ఉండడం శుభపరిణామమన్నారు. ఆర్థికంగాను, రాజకీయంగాను మహిళలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఇక ఈ సదస్సులో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ...

(వాయిస్ 24 సెకన్లు)

రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ సింగ్, రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, పయ్యావుల కేశవ్ లతో పాటూ.. పార్లమెంటులోని సాధికారత కమిటీ సభ్యులు, దేశంలోని అన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లోని మహిళా శిశు సంక్షేమ కమిటీల ఛైర్మన్లు, సభ్యులు కలిపి మొత్తం 190 మంది ఈ సదస్సుకు హాజరయ్యారు.

విరామం

==============================

"స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 17వ తేదీన దేశవ్యాప్తంగా ప్రారంభిస్తారని చిత్తూరు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్. డి.టి సుధారాణి తెలిపారు. ఈనెల 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఈరోజు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు, పిల్లలకు సంబంధించిన ఆరోగ్య సంరక్షణా సేవలను ఈ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే అందించనున్నామని.. వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

==============================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రేపటి నుండి రెండు రోజుల పాటు 4వ కలెక్టర్ల సదస్సు జరగనుంది. అమరావతిలోని సచివాలయం 5వ బ్లాక్ లో రేపు ఉదయం 10 గంటలకు ఈ సదస్సు ప్రారంభం కానుంది. పౌరసేవలు, సంక్షేమ పథకాల అమలుపై జిల్లాల వారీగా జవాబుదారీతనం ఉండేలా ఈ సదస్సుని నిర్వహించాలని ఉన్నత స్థాయి అధికారులను ముఖ్యమంత్రి ఇప్పటికే ఆదేశించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో మంగళవారం స్థూల రాష్ట్ర ఉత్పత్తిపై చర్చించనున్నారు. ఇందులో భాగంగా ప్రాథమిక రంగం నుంచి వ్యవసాయం, దాని అనుబంధ రంగాలతో పాటూ సేవా రంగంలో పర్యాటకం, హౌసింగ్ తదితర శాఖల పురోగతిని ఆయా జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకోనున్నారు.

==============================

ఎంతో ఉన్నత లక్ష్యంతో ప్రారంభించిన `ఎర్రన్న విద్యా సంకల్పం` సత్ఫలితాలను ఇస్తుండటం ఆనందంగా ఉందని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో 130 మంది ఎర్రన్న విద్యా సంకల్పం విద్యార్థులు ఉత్తీర్ణులు కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో ఎర్రన్న విద్యా సంకల్పం విద్యార్థులతో ఈరోజు ఆయన ముఖాముఖి

నిర్వహించారు. భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఎర్రన్న విద్యా సంకల్పం కార్యక్రమాన్ని 2023లో ప్రారంభించామని, ఆర్థిక ఇబ్బందులు ఇతర సమస్యలతో పోటీ పరీక్షలకు నిరుద్యోగులు దూరం కాకూడదనే దీనిని ఏర్పాటు చేశామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో యువతకు డీఎస్సీ, ఏపీపీఎస్సీ, గ్రూప్స్, పోలీస్ పరీక్షలకు అవసరమైన కోచింగ్, మాక్ టెస్టులు, మెటీరియల్ ను ఈ కార్యక్రమం ద్వారా అందజేయడం జరిగిందని తెలిపారు.

==============================

ఆసియా కప్ 2025లో భాగంగా భారత పురుషుల జట్టు ఈరోజు తన తదుపరి మ్యాచ్ ను పాకిస్తాన్ తో ఆడనుంది. దుబాయి ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా రాత్రి 8 గంటలకు ఈ టీ20 క్రికెట్ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఇరు జట్లు తమ తొలి మ్యాచ్ లో విజయం సాధించడంతో ఈ మ్యాచ్ లో గెలిచే జట్టు గ్రూప్ ఏ నుండి సెమీఫైనల్స్ కు అర్హత సాధిస్తుంది.

ఇక మరోవైపు మూడు మ్యాచ్ ల ఓడీఐ సిరీస్ లో భాగంగా భారత మహిళా జట్టు చండీగఢ్ లోని ముల్లాన్ పూర్ వేదికగా ఈరోజు ఆస్ట్రేలియాతో తొలి వన్డే మ్యాచ్ ఆడుతోంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్ ఆస్ట్రేలియాకు 282 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

==============================

ఉత్తర తెలంగాణ దానికి ఆనుకుని ఉన్న విదర్భ ప్రాంతాలలో అల్పపీడనం కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా ఉత్తర కోస్తాంధ్రలో రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. బలమైన ఈదురు గాలులు గంటకు 40 నుండి 50 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

==============================

==============================